క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



చెన్నారావుపేట : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని బోజేర్వు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బోజేర్వు గ్రామానికి చెందిన కాసాని మల్లయ్యకు చెందిన ఎద్దును మేతకు తీసుకెళ్లాడు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు గ్రామశివారులోని 11కేవీ విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి రూ.80వేల విలువ గల ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని మల్లయ్య కోరాడు.

భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు

హసన్‌పర్తి: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ భరోసా సభకు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యకమంలో పీపీఎల్ రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బండి ఓంకార్, మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణగౌడ్, నాయకులు మేకల అభినేష్, పవన్‌కళ్యాణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి




ఖిలా వరంగల్: వేసవిలో గుక్కెడు తాగునీటి కోసం తల్లాడిపోతున్నామని, తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని భూపేష్‌నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 34వ డివిజన్ శివనగర్ భూపేష్‌నగర్ కాలనీ రోడ్డుపై స్థానిక మహిళలు కాలి బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ నాయకుడు గోరంటల శరత్ బాబు మాట్లాడుతూ పైపులైన్ ద్వారా సరఫరా జరిగే తాగునీటిపై కాలనీవాసులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వేసవిలో బావులు, బోర్లు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంతి, స్పందన, సరళ, అనిత తదితరులు పాల్గొన్నారు.

కాలనీలను అభివృద్ధి చేసుకుందాం..

ఖిలా వరంగల్: వెనకబడిన కాలనీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని శంభునిపేట, రంగశాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కర్నె రవీందర్, రామానుజం జగదీశ్వర్ సూచించారు. ఈమేరకు వరంగల్ – ఖమ్మం రోడ్డులోని సిల్వర్ క్రాస్ పాఠశాల ప్రాంగణంలో నాగబండి శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నగర మేయర్ గుండు సుధారాణి, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సహాయ సహకారాలతో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవం



వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన పట్టాభి రామాలయ విగ్రహ శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ లలితాయాదవ్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి, పాక్స్ చైర్మన్ హరికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, జిల్లా నాయకులు బుద్దె శ్రీనివాస్, బుద్ధ వెంకన్న, ఆదాం, భక్తులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినుల బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి ఉదయం 9గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హనుమకొండ పెట్రోల్‌పంప్ మీదుగా నయీంనగర్, కేయూసీ క్రాస్, రామారం మీదుగా ఎర్రగట్టుగుట్ట వరకు బైక్‌ర్యాలీ సాగుతుందని వివరించారు. కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్, కాజీపేట ఏసీపీలు పాల్గొననున్నట్లు చెప్పారు.

అభివృద్ధి దిశగా ఎల్గూర్ స్టేషన్



ఎల్గూర్ రైల్వేస్టేషన్ పాత భవనం



నిర్మాణంలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

- వేగంగా రైల్వే స్టేషన్ విస్తరణ పనులు
- పాత స్టేషన్ భవనం కూల్చివేత
- నూతన భవనాల నిర్మాణం పూర్తి
- తొలగనున్న ప్రయాణికుల కష్టాలు

సంగెం : మండల పరిధిలోని ఎల్గూర్ రైల్వేస్టేషన్ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు 50ఏళ్ల క్రితం ఎల్గూర్ రైల్వేస్టేషన్ భవనం డంగు సున్నంతో నిర్మితమైంది. ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది. కానీ మూడోలైన్ స్థానంలో ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో పాత స్టేషన్ భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తున్నారు. అలాగే ఇంజనీరింగ్, సిగ్నలింగ్ వ్యవస్థ కోసం నిర్మించిన భవనాలను సైతం కూల్చివేస్తున్నారు. నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ భవనం, స్టేషన్ మాస్టర్, టికెట్ ఇష్యూంగ్ భవనం, సిగ్నలింగ్ వ్యవస్థ తదితరాల నిర్మాణం పూర్తి కావడంతో పాత భవనాల్లోంచి నూతన భవనాల్లోకి మార్చారు. విస్తరణ పనులు వేగంగా జరుగుతుండడంతో రైల్వేస్టేషన్ రూపురేఖలన్ని పూర్తిగా మారిపోనున్నాయి. గతంలో నాలుగు లైన్లు, రెండు ప్లాట్ ఫాంలు ఉండగా, ఇప్పుడు మూడోలైన్ నిర్మాణంతో ఆరు లైన్లు, నాలుగు ప్లాట్ ఫాంల నిర్మాణం జరుగుతున్నాయి.

నిర్మాణ దశలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

గతంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేక ఒకటో ప్లాట్ ఫాం నుంచి అవతలి వైపు ఉన్న 2వ ప్లాట్‌ఫాం వెళ్లడానికి రైలు పట్టాలు దాటుతూ పలువురు ఆగిఉన్న రైళ్ల కింది నుంచి వెళ్తున్న క్రమంలో పలువురు మృత్యువాత పడగా అనేకమంది గాయాలతో బయటపడిన సంఘటనలు ఉన్నాయి. మూడో లైన్ నిర్మిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. దీంతో ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్ ఫాంకు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయని ప్రజలు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో మూడోలైన్, నాలుగు ప్లాట్ ఫాంలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. రైల్వే లైన్లు, స్టేషన్ విస్తరణ పనులు పూర్తి అయితే ఇక్కడ కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ చేస్తే ఈ ప్రాంతంలోని ప్రజలకు హైదరాబాద్, విజయవాడ, మంచిర్యాల తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని పలువురు కోరుతున్నారు.



గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.250 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది

దుగ్గొండి : నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో రూ.250 కోట్లతో తారు రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని గిర్నిబావిలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి మరమ్మతు పనులను ఆయన ఆదివారం పరిశీలించి, మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్డు సౌకర్యం లేని 108 గ్రామాలు, తండాలలో తారురోడ్లు నిర్మాణం చేశామన్నారు. గతంలోని పాత తారురోడ్లను పునర్ నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రతిరోజు సమీక్షిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్‌లు, ఏజెన్సీలు 45రోజులలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దుగ్గొండి, గిర్నిబావి రహదారి డబుల్ రోడ్డు పనులను జూన్ 15లోగా పూర్తి చేయాలని ఏఈ సందీప్‌కు సూచించారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి గిర్నిబావి సెంటర్‌లో 600మీటర్ల రోడ్డును 13.5 మీటర్లు వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి మరో 10రోజుల్లోగా అనుమతులు వస్తాయని ఆయన వెల్లడించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు కాట్ల భద్రయ్య, కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

విరాళం అందజేత



సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో నిర్మిస్తున్న శివాలయానికి ఆదివారం సర్పంచ్ పోతుల ప్రభాకర్ రూ.1,00,116లు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. బోనాల కొమురయ్య, పెద్దగోని లక్ష్మినారాయణ, జనగాం రమేష్, శాబోత్ శ్రీనివాస్ నాయకులు జనగాం శ్రీనివాస్, అజేయ్‌కుమార్, కొమ్మాలు, రమేష్‌బాబు, లింగమూర్తి, అశోక్, రవి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



బతుకమ్మ సెంటర్‌లో విరిగిన విద్యుత్ స్తంభం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలో గల బతుకమ్మ సెంటర్‌లో ఇటీవల వీచిన భారీ గాలులకు విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో బతుకమ్మ సెంటర్ వద్ద సిమెంట్ గచ్చు ఉండటంతో స్తంభం చుట్టూ గద్దె కట్టారు. ఇటీవల వీచిన గాలులకు పోల్ విరిగి గద్దెపై చివరికి కదిలి ఇనుప చువ్వలపై ఆగి ఉండగా విద్యుత్ సరఫరా అవుతూనే ఉంది. సిమెంట్ కల్లంపై పలువురు రైతులు మొక్కజొన్నలను ఆరబోసుకుంటున్నారు. ఎప్పుడు ఏ క్షణాన స్తంభం కిందపడుతుందో తెలియని పరిస్థితి. ప్రమాదం జరగకముందే విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విరిగిపోయిన స్తంభాన్ని తొలగించి కొత్త పోల్ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కట్టయ్య వర్ధంతిని విజయవంతం చేయాలి



బొమ్మల అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీమాబాద్: ఈనెల 11న నిర్వహించనున్న భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి, అంబేడ్కర్ వాది బొమ్మల కట్టయ్య రెండవ వర్ధంతిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మల అంబేడ్కర్, అంబేడ్కర్ భవన కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేషం పిలుపునిచ్చారు. కరీమాబాద్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ సంఘాలను విస్తరించేందుకు కట్టయ్య ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కరీమాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. కాగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అంబేడ్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎరుకల మహేందర్, తరాల రాజమణి, కడారి కుమార్, భిక్షపతి, శంకర్, గౌతం, సిద్దార్థ, రాంప్రసాద్, రవితేజ, దామోదర్, సుధాకర్, సురేష్, విక్రమ్, వినోద్, శివ, నాగమణి, సౌజన్య, మనోహర, శ్రీదేవి పాల్గొన్నారు.

కార్మికులను తిరిగి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న బాధిత కార్మికులు

హన్మకొండ చౌరస్తా: అక్రమంగా తొలగించిన పెట్రోల్ బంక్ కార్మికులను వెంటనే తిరిగి పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని విశ్వేశ్వర సర్వీస్ స్టేషన్ (హిందూస్తాన్ పెట్రోలియం)లో ఆవరణలో కార్మికులతో కలిసి ఆదివారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ 30ఏళ్లుగా పనిచేస్తున్న సుమారు 20మంది కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు పనిభద్రత, ఈఎస్ఐ, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను ఐక్యం చేసి ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ కార్మిక సంఘం నాయకులు మంద యాకనారాయణ, దయానంద్, కాశబోయిన కొముర‌య్య, బుర్ర గోవర్ధన్, వెంకటేష్, శ్రీనివాస్, రేవంత్, సరళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళ ఇళ్లు కూల్చడం సరికాదు



నిరాహార దీక్ష చేస్తున్న బాధితులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వరంగల్: నగరంలోని 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన దామెర అశోక్, మైబు దంపతుల ఇంటిని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూల్చివేసి అందులో పార్టీ జెండాను నిర్మించడం సరికాదని బీజేపీ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ అన్నారు. ఇళ్లు కూల్చి జెండా గద్దెను కట్టిన స్థలంలో నిరాహార దీక్షలు చేస్తున్న అశోక్, మైబు దంపతులకు ఆదివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద మహిళ మైబుకు చెందిన 60గజాల స్థలాన్ని కబ్జా చేసి తిరిగి అడిగేందుకు వచ్చిన క్రమంలో పార్టీ జెండా ప్రత్యక్షమవడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ప్రవీణ్, పోలెపాక మార్టిన్ లూథర్, మాదాసు రాజు, పిట్ట సరస్వతి, యువ మోర్చా నాయకులు బైరి హరీష్, గోవింద్ సింగ్, కోమాకుల నాగరాజు, కోట సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మిర్చి, మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిన క్రమంలో మండలంలోని వివిధ గ్రామలకు చెందిన బాధిత రైతులకు మంజూరైన పరిహారం చెక్కులను నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. శాయంపేటలో 22, పత్తిపాకలో 7, హుస్సేన్‌పల్లి 12, గట్లకానిపర్తిలో 108, తహరాపూర్‌లో 10 మంది మిర్చి రైతులకు పరిహారం చెక్కులు మంజూరైనట్టు తెలిసింది. అలాగే కొత్తగట్టు సింగారంలో 64, తహరాపూర్‌లో 7, గట్లకనిపర్తిలో 11, శాయంపేటలో 66, పత్తిపాకలో ఇద్దరు, పెద్దకొడెపాకలో ఒక మొక్కజొన్న రైతుకు పరిహారం చెక్కులు మంజూరయ్యాయని సమాచారం. బాధిత రైతులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేయనున్నట్లు అధికారులు వివరించారు.

హనుమాన్ శోభాయాత్ర



మడికొండ: కాజీపేట మండలం మడికొండలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. మెట్టుగుట్ట వద్ద ఉన్న పోచమ్మ ఆలయం వద్ద నుంచి ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర.. మడికొండ చౌరస్తా మీదుగా ఎస్సీ కాలనీ నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు కొనసాగింది. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిగ్గుల సతీష్‌కుమార్, దువ్వ శ్రీకాంత్, నవీన్, ఆకుల శరత్, బండ రాజు, రాజు పాల్గొన్నారు.

కాజీపేటలో అంజన్న భక్తుల ర్యాలీ

కాజీపేట: కాజీపేట పట్టణ పురవీధుల్లో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ భక్తులు ఆదివారం రాత్రి ఆంజనేయుడి భారీ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా యాదాద్రి జిల్లా నుంచి తెప్పించిన హనుమంతుడి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి ఊరేగించారు. గిరిజన కళాకారులు, కోలాట బృందం, చెక్క భజనల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. హనుమాన్ మాలధారులు, భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపు సాగింది.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



కాజీపేట: కాజీపేట పట్టణంలో ప్రధాన రహదారిపై హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్న మహిళను గుర్తించి బ్యాగును ఓ హోంగార్డు ఆదివారం సాయంత్రం అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామికి భారత ఆహార సంస్థల గోడౌన్ వద్ద రహదారిపై హ్యాండ్‌బ్యాగు దొరికింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత మహిళను గుర్తించి బ్యాగు అందించారు. బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బ్యాగును అందించిన కుమారస్వామికి బాధిత మహిళా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వానాకాలం పంటసాగు ఎలా?

- చెరువులోంచి నీటిని వదిలిన వైనం
- ఇరిగేషన్ అధికారుల పనేనా..
- రైతులకు తీరని నష్టం




చెరువులోంచి వృథాగా పోతున్న నీరు (ఇన్‌సెట్‌లో) ఇరిగేషన్ శాఖ జారీ చేసిన లేఖ

వర్ధన్నపేట : వానాకాలం రాకముందే నార్లు పోసుకుని సీజనల్ వచ్చే సరికి నాట్లు వేసుకోవచ్చనే అన్నదాతల ఆశలు అడియాసలు చేసిన సంఘటన ఇది. వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువులో మట్టి మాఫియాతో చేతులు కలిపిన స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు చెరువులో నీరు ఉండగానే వేసవి కాలంలో మట్టిని విక్రయించడానికి గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేశారు.అనంతరం ఆ కాపీని ఇరిగేషన్ శాఖకు పంపించి మట్టిని తోడుకునేందుకు అనుమతి తీసుకున్నారు. అనుమతి ఉత్తర్వులు డీఈఈ/ఐఎస్‌డీ/నెం2/వర్ధన్నపేట/17 ఏప్రిల్ 26న ఇరిగేషన్ శాఖ ఉప నిర్వాహక ఇంజనీర్ అనుమతి పంపించారు. గ్రామ పంచాయతీ తీర్మానం చేశారో.. లేదో సైతం ఇంకా స్పష్టం లేదని స్థానిక పేరు తెలుపని నాయకులు చెబుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించిన వారు స్పందించడం లేదు.

దేవుడికి సైతం శఠగోపం

గతేడాది సైతం మట్టిని అమ్మి దేవాలయ అభివృద్ధి పనులు చేద్దామని గ్రామస్తులను నమ్మించారు. వచ్చిన ఆదాయంలో పదో పరకో అనే విధంగా కొంత ఇచ్చి మట్టి మాఫియాతో చేతులు కలిపి దేవుడికి సైతం శఠగోపం పెట్టారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పంపకాలు చేసుకున్నారనే ఆరోపణలు సైతం ఆ సమయంలో వినిపించాయి.

రైతుల ఆశలు ఆవిరి

చెరువులో నీరు ఉందని దీంతో తాము ముందస్తు నార్లు పోసుకుని వర్షాకాలం రాగానే నాట్లు వేసుకుంటే పంట దిగుబడులు వస్తాయని రైతన్నలు ఆశతో ఉన్నారు. కానీ వారి ఆశలను అడియాసలు చేసి వారి నోట్లో మట్టి కొడుతున్నారని పలువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అవినీతి ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలి



దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట : దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని డీపీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బలగం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, డీపీఆర్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రమేష్ నిరసన మహా దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో బాబురాజు యాదవ్, మాతంగి బాబు, దామెర సుధాకర్, శ్రీనివాస్‌చారి, సాంబన్న, ఉప్పన్న, రవి, రాజు, శ్రీకాంత్, సరోజన, మమత, సుధారాణి, అనిత, శోభ, లక్ష్మి, కవిత, సునీత, మౌనిక, రజిత, రమాదేవి, ఎల్లమ్మ, స్వప్న, సర్ణలత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని కల్లెడలో గల ఆర్డీఎఫ్ అచ్యుతపాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో 2011–13సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దన్, అధ్యాపకులు రాంమూర్తి, మదన్, ప్రసాద్, మోహన్, మహేందర్, రాజు, నాగేష్, కవిత, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఖానాపురం: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



చెన్నారావుపేట: బియ్యం అందిస్తున్న నాయకులు

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తల్లి ఆగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సైతం తక్కళ్లపల్లి రవీందర్‌రావును పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కొత్త రాకేష్ ఇటీవల మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ తూటి పావని, రమేష్, పులిశేరు రాజేందర్, బోనగిరి స్వామి, రాజేందర్, ముత్యం భద్రయ్య, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మామునూరు: విలీన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని గాడిపెల్లి గ్రామంలో కార్పొరేటర్ గద్దె బాబుతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రెయినేజీలు, పాత గ్రామ పంచాయతీ భవన సముదాయం, హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్, బెంబిరి బాబురావు, పోచన స్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఆత్మకూరు : పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నగరబోయిన భద్రమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసగృహంలో రూ.65వేలు విలువ చేసే ఎల్‌ఓసీ అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంఆర్‌ఎఫ్ ఆంధ్రప్రాంతానికే పరిమితమయ్యేదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దారని చెప్పారు. నాయకులు రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.